సాక్షి నంద్యాల

శనివారం, 23, సెప్టెంబర్, 2023



రూ.4.5 లక్షల ఆదాయం

గడివేముల: మూలపెద్దమ్మ ఆలయానికి ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు హుండీ ద్వారా రూ.4,57,761 ఆదాయం వచ్చింది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కానుకలను లెక్కించారు.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబాదేవికి శుక్రవారం అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు జరిపారు.



'సుంకేసుల'లో 1.026 టీఎంసీలు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శుక్రవారం డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఐదు రోజుల పాటు వర్షం

ఎమ్మిగనూరు రూరల్: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో నేటి నుంచి ఈనెల 27వ తేదీ వరకు చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీశైలం నుంచి 9,511 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 9,511 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 1.024 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 1,946 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,887, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి 735, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీరు విడుదలైంది. డ్యాం పరిసర ప్రాంతాల్లో 32 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో 88.4734 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 853.70 అడుగులకు చేరుకుంది.

శ్రీమఠంలో బంగారు పల్లకీ సేవ



బంగారు పల్లకీలో బృందావన ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్రలో పుణ్యస్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను గజ వాహనం, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఊరేగించారు.

విద్యుత్ కనెక్షన్ల వేగం పెంచండి

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు, ఇతర సామాగ్రి సిద్ధంగా ఉన్నాయని, వెంటనే కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయని, వీటి వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి


కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఆప్షన్-3 ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై మండలాధికారులతో సమీక్షించారు. భూ హక్కు పత్రాల పంపిణీ ఓర్వకల్లు, కర్నూలు రూరల్, గూడూరు, పెద్దకడబూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లో పెండింగ్‌లో ఉందని, సోమవారంలోపు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్‌లో మంత్రాలయం మండలం చాలా వెనకబడి ఉందని అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తహసీల్దార్, సర్వేయర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.



శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో మిరప పంటలో నిలిచిన వర్షపు నీరు



జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

ఆకాశం ఉరిమింది.. పుడమి మురిసింది

- జిల్లాలో భారీ వర్షం
- శిరివెళ్లలో అత్యధికంగా 10.5 సెం.మీ
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- జిల్లా వ్యాప్తంగా 30.5 మి.మీ వర్షపాతం నమోదు
- రబీ పంటల సాగుకు పొలాలు పదును

సాక్షి, నంద్యాల: వర్షాభావ పరిస్థితులతో రబీ పంటల సాగుకు సందిగ్ధం నెలకొన్న సమయంలో వరుణుడు కరుణించాడు. మరో వారం రోజుల్లో రబీ సాగు ప్రారంభమవుతున్న తరుణంలో విత్తనానికి అదునుగా పుడమి పదును అయ్యింది. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 30.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒక్క ప్యాపిలి మండలంలో మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా శిరువెళ్ల మండలంలో 105.4 మి.మీ, అత్యల్పంగా డోన్‌లో 0.4 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదైంది. జిల్లాలో సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 134 మి.మీ కాగా.. ఇప్పటి వరకు 132.1 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న నాలుగైదు రోజుల్లో ఆశాజనకంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఊరట చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప, జొన్న, మినుము, కంది, పెసర, ఆముదం, ఉల్లి, పొద్దుతిరుగుడు, తదితర పంటలకు ఈ భారీ వర్షం ప్రాణం పోసింది. చెరువులను తలపించేలా పొలాల్లో వర్షపునీరు చేరింది. రబీ సీజన్ ప్రారంభానికి వారం రోజుల ముందే భారీ వర్షం కురియడంతో రబీ అన్ని విధాలా కలిసోస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో భారీ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో బోర్ల కింద పంటలు సాగు చేసే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అవుకు, ప్యాపిలి మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో కుండపోత వర్షం కురవడంతో కొలిమిగుండ్ల మండలం సద్దల వెంగన్న చెరువుకు భారీగా నీరు చేరి అలుగు పారింది. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చెరువు వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు నిర్వహించారు.
- రుద్రవరం మండలంలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. రుద్రవరం - శిరివెళ్ల, పేరూరు - ఎర్రగుంట్ల, ఎర్రగుడిదిన్నె - నంద్యాల జాతీయ రహదారి, చిలకలూరు - ఆళ్లగడ్డ మండలం బత్తలూరు వైపు ఉన్న వక్కిలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. రుద్రవరం, నర్సాపురం, ఎల్లావత్తుల, ముకుందాపురం, చందలూరు, తదితర గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లోకి వర్షపు నీరు నిలిచింది.
- దొర్నిపాడు మండలంలో వాగులు, వంకలు ఉప్పొంగి కుందూనదికి భారీగా వరద నీరు చేరుతోంది. వర్షాలు లేక వాడు పడుతుంట పంటలకు ఈ వర్షం ఊపిరి పోసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- కోవెలకుంట్ల పట్టణంలోని అమ్మవారిశాల, బీసీ హాస్టల్, అయ్యప్పస్వామివీధి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో రబీ సీజన్‌లో అత్యధికంగా శనగ సాగు చేయనున్న నేపథ్యంలో భారీ వర్షం ఆశలు రేకెత్తించింది.
- కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల, గ్రామాలతో పాటు కొత్తపల్లిలో మోస్తరు వర్షం కురవడంతో పంట కాల్వల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.
- మహానంది మండలంతో పాటు నల్లమలలో భారీ వర్షం కురిసింది. మహానంది-గాజులపల్లె మార్గంలోని మహానంది వ్యవసాయ కళాశాల సమీపంలోని పాలేరువాగు ఉప్పొంగింది.



కొలిమిగుండ్ల మండలం సద్దల వెంగన్న చెరువు అలుగెక్కి పారుతున్న దృశ్యం

మండలాల వారీగా వర్షపాతం వివరాలు ఇలా...

మండలం	వర్షపాతం (మి.మీ)
శిరివెళ్ల	105.4
రుద్రవరం	91.8
ఆత్మకూరు	77.4
కొత్తపల్లి	58.6
మహానంది	53.2
కోవెలకుంట్ల	52.0
వెలుగోడు	41.6
పగిడ్యాల	40.6
సంజామల	34.6
అవుకు	32.2
శ్రీశైలం	30.4
దొర్నిపాడు	30.4
బండి ఆత్మకూరు	29.8
జూపాడు బంగ్లా	28.8
గోస్పాడు	24.2
కొలిమిగుండ్ల	24.2
నంద్యాల	23.4
నందికొట్కూరు	19.2
ఆళ్లగడ్డ	18.0
మిడుతూరు	16.4



రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు

గంగమ్మ ఒడికి గణనాథుడు



కలెక్టర్ కార్యాలయ పరిపాలన గణపతికి పూజలు నిర్వహిస్తున్న జేసీ, ఎస్పీ, తదితరులు

- నంద్యాలలో వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం

నంద్యాల(వ్యవసాయం): ఐదు రోజుల పాటు భక్తుల చేత పూజలందుకున్న విఘ్న వినాయకుడు గంగమ్మ ఒడికి చేరాడు. నంద్యాల పట్టణంలో గణేశ్ నిమజ్జనోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. శోభాయాత్ర కనులపండుగా సాగింది. జై బోలో మహారాజ్‌కి జై .. గణపతి బొప్పా మోరియా.. నినాదాలు మిన్నంటగా.. జైజై గణేశా.. జయము లివ్వు గణేశా.. వినాయకా శుభకరా.. ఉండ్రాలయ్యా.. దండలయ్యా పాటలు మారుమోగగా.. భక్తుల తీన్‌మార్ డ్యాన్స్‌లు హుషారెత్తించగా.. కోలాటాలు.. చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. జిల్లా కేంద్రం నంద్యాలలో నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చిన్న చెరువు వద్ద వినాయక ఘాట్‌లో గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో గంగాదేవికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఆర్‌డీఓ శ్రీనివాసులు, కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, గణేష్ కేంద్ర మహోత్సవ సమితి నిర్వాహకులు, తదితరులు సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి నిమజ్జనాన్ని ప్రారంభించారు. క్రేన్ల సహాయంతో గణేష్ విగ్రహాలను చిన్న చెరువులో నిమజ్జనం చేశారు. ముందుగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కొలువైన పరిపాలన గణపతికి జేసీ పూజలు చేసి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విగ్రహాలన్నీ కల్పనా సెంటర్‌కు చేరుకోవడంతో శోభాయాత్ర ప్రారంభమైంది. బైర్మల్‌వీధి, రీడింగ్ రూం జంక్షన్, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కు రోడ్డు మీదుగా శోభాయాత్ర కొనసాగింది. ఈ యాత్రలో గణేష్ మహోత్సవ కేంద్ర సమితి వారు విగ్రహ ఉత్సవ కమిటీ వారికి మెమెంటోలను అందజేశారు. నిమజ్జనానికి తరలివెళ్తున్న విగ్రహాలకు రోడ్లకు ఇరువైపులా ఉన్న భక్తులు పూజలు చేశారు. పట్టణంలోని 600లకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించగా వీటన్నింటిని నిమజ్జనం చేయడానికి వినాయక ఘాట్ వద్ద ఐదు క్రేన్‌లను ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి ఘాట్‌కు విగ్రహాలు అధిక సంఖ్యలో తరలిరావడంతో నిమజ్జనం ఆలస్యమైంది. ఈ కార్యక్రమం అర్ధరాత్రి వరకు కొనసాగింది.



చిన్న చెరువులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

భారీ బందోబస్తు...

వినాయక ఘాట్ వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తును ఏర్పాటు చేశారు. అగ్నిమాపక సిబ్బంది ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- జేసీ రాహుల్ కుమార్ రెడ్డి
- మండల స్థాయి స్పందనకు 167 దరఖాస్తులు

బేతంచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్పందనలో స్వీకరించిన వినతి పత్రాలను నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సేవలు అందించాలన్నారు. పూర్తి స్థాయిలో ప్రజా సమస్యలను మండల, సచివాలయ స్థాయిలోనే పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. ప్రతి రోజు 3 నుంచి 5 గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించడంతోపాటు సూచించిన 3 రిజిస్టర్లలో సమస్యలను నమోదు చేయాలన్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో కచ్చితమైన విచారణ జరిపి నివేదికలు పంపాలని జేసీ ఆదేశించారు. రెవెన్యూ సర్వీసులకు సంబంధించి అనేక సమస్యలు వస్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదన్నారు. మండల స్థాయి స్పందన కార్యక్రమానికి 167 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటిని క్షుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, రాజు, చిట్టి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

వినతుల్లో కొన్ని..

- గూటుపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో 3,500 ఎకరాలు సాగు భూమిని గతంలో బేతంచెర్ల మండలంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ వక్ఫ్‌బోర్డు భూమి జాబితాలో చేర్చడంతో రుణాలు, క్రయ, విక్రయాలు నిలిచి పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ సర్పంచ్ శ్రీరాములు, గ్రామస్తులు విన్నవించారు. రైతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను జేసీ ఆదేశించారు.
- తన కుమారుడు పవన్ తేజ పుట్టుకతోనే మూగ అని, మాటలు వచ్చేలా వైద్యం చేయించాలని, పింఛన్ కూడా మంజూరు చేయాలని గోరుమానుకొండ గ్రామానికి చెందిన మహేశ్వరి జేసీకి వినతి పత్రం అందజేశారు.
- తన కుమార్తెను అల్లుడు మానసికంగా వేధించడంతో అనారోగ్యానికి గురై మృతి చెందిందని, వివాహ సమయంలో కట్నంగా ఇచ్చిన నాలుగు తులాల బంగారు తిరిగి ఇప్పించాలని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ అర్జీ ఇచ్చారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంధుల బాల, బాలికల కోసం రెసిడెన్షియల్ స్కూలు ఏర్పాటు చేయాలని బుగ్గానిపల్లె తండాకు చెందిన లక్ష్మణ్ నాయక్ వినతి పత్రం అందజేశారు.

నేడే 'పట్టా'భిషేకం

- స్నాతకోత్సవానికి ట్రిపుల్ ఐటీడీఎంలో ఏర్పాట్లు పూర్తి
- 2019-23లో బీటెక్ పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రదానం
- బంగారు పతకాలు అందుకోనున్న ఐదుగురు

కర్నూలు సిటీ: కల సాకారమైంది.. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న శుభతరుణం రానే వచ్చింది. నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న యువ ఇంజినీర్లు బీటెక్ పట్టాలు అందుకోనున్నారు. ఇందుకు కర్నూలు సమీపంలోని ట్రిపుల్ ఐటీడీఎం(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్)లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యాంపస్‌లోని నూతన కృష్ణ సెమినార్ హాలులో ఐదో స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఐఐటీ హైదరాబాద్, రూర్కీ పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ బీవీ ఆర్ మోహన్ రెడ్డి, భారతీయ సమాచార రూపకల్పన, తయారీ సంస్థ చైర్మన్ ఆచార్య హెచ్ఏ రంగనాథ్ హాజరుకానున్నారు. ఐదో స్నాతకోత్సవంలో 2019-23 బ్యాచ్‌కి చెందిన బీటెక్ విద్యార్థులు 113 మంది, ఎంటెక్ విద్యార్థి ఒకరు పట్టాలు అందుకోనున్నారు. అదే విధంగా వివిధ బ్రాంచ్‌ల్లో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు బంగారు పతకాలు బహూకరించనున్నారు.

ప్రతిష్టాత్మక సంస్థగా..

ఏపీ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్‌ఐటీ డీఎంను కర్నూలుకు మంజూరు చేశారు. మొదటగా కాంచీపురం(తమిళనాడు)లో మెంటర్ ఇనిస్టిట్యూట్‌గా 2015 ఆగస్టు నెలలో మూడు బీటెక్ కోర్సులతో తరగతులు మొదలయ్యాయి. కాంచీపురం నుంచి 2018లో కర్నూలు తరలించి శాశ్వత క్యాంపస్‌ను ప్రారంభించారు. మొదటగా మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్సు కోర్సులు మాత్రమే ఉండేవి. 2019-20 అకడమిక్ ఇయర్ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డాటా సైన్స్ అనే మరో బీటెక్ కోర్సు, మూడు పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభించారు. మొదట క్యాంపస్‌లో 75 బీటెక్ సీట్లు ఉండగా.. నేడు 271కి పెరిగాయి.

వసతుల్లో మేటి

దేశంలోని అన్ని ప్రాంతాలకు అనుగుణమైన వాతావరణం ఉండేలా క్యాంపస్‌ను అన్ని వసతులతో తీర్చిదిద్దారు. 152 ఎకరాల విస్తీర్ణంలోని 60 ఎకరాల్లో భవనాలు నిర్మించారు. క్రీడల కోసం ఇండోర్ స్టేడియం, యోగా, జిమ్‌లు ఏర్పాటు చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టు, మినీ క్రికెట్ స్టేడియం సైతం నిర్మిస్తున్నారు. ప్రత్యేకంగా పోస్టల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. 24 గంటల వైఫై సేవలు అందుతున్నాయి. మొదట రూ.218 కోట్లు, తరువాత రూ.256 కోట్లతో పనులు పూర్తి చేశారు. తాజాగా మరో రూ.50 కోట్లు మంజూరయ్యాయి. క్యాంపస్‌లో మొత్తం 11 భవనాలు, ఐదు సెమినార్ హాల్స్ ఉన్నాయి. ఒక మల్టీపర్పస్ హాల్ సేవలు అందిస్తోంది. విద్యార్థుల కోసం డిజిటల్ లైబ్రరీ, 5 వేలకుపైగా పుస్తకాలు, వందలాది పరిశోధన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. దేశంలో ఉన్నటువంటి 25 ట్రిపుల్ ఐటీల్లో కర్నూలు ట్రిపుల్‌డీఎం మేటిగా నిలుస్తోంది.



జగన్నాథగట్టుపై నిర్మించిన ట్రిపుల్ ఐటీడీఎం భవనం

కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగం

ట్రిపుల్ ఐటీడీఎంలో కోర్సు పూర్తి అయిన వారిలో 80 శాతం మందికి ఉద్యోగాలు వచ్చాయి. దీపక్ రాథోర్ అనే విద్యార్థి అత్యధికంగా ఏడాదికి రూ.1.36 కోట్ల వార్షిక వేతనంతో అమెజాన్‌లో ఉద్యోగం పొందారు. సరాసరి రూ.9.52 లక్షల వార్షిక వేతనం పొందే ఉద్యోగాలు చాలా మందికి వచ్చాయి. ఎంటెక్ చదివిన వారిలో 100 శాతం మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పొందారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ రోబోటిక్స్ ఆటోమేషన్ విభాగాలలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఎంటెక్ కోర్సులు ప్రారంభించనున్నారు. ఎంటెక్ రెండు సంవత్సరాల్లో ఏదైనా ఒక సంవత్సరం నార్వేలో చదివేందుకు నార్వే ఆగ్దర్ యూనివర్సిటీతో ట్రిపుల్ ఐటీడీఎం ఒప్పందం చేసుకుంది.

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం



సంస్థలో పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాం. నాలుగేళ్లలో 30 రీసెర్చ్ ప్రాజెక్టులు సాధించాం. దీంతో పాటు కర్నూలులోని పలు ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులకు రోబోల తయారీపై శిక్షణను ఇస్తున్నాం. వచ్చే నెల చివరి నాటికి క్యాంపస్‌లో 100 శాతం పనులు పూర్తవుతాయి.

\- ఎల్ఎస్‌వీ సోమయాజులు, ట్రిపుల్ ఐటీ డీఎం, డైరెక్టర్

క్లుప్తంగా

డోన్ పాతపేటలో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటలోని పెద్దమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న కిరాణం కొట్టు వ్యాపారి అలంపూర్ రామయ్య ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. వ్యక్తిగత పనుల నిమిత్తం రామయ్య, అతని భార్య గురువారం ఇంటికి తాళం వేసి నంది కొట్కూరులోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గమనించిన దొంగలు రాత్రి ఇంటిలోకి చొరబడి బీరువాలో 12 తులాల బంగారం, రూ. 40 వేల నగదును అపహరించారు. శుక్రవారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని స్థానికులు గమనించి రామయ్యకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి దొంగల ఆచూకీ కోసం ఆధారాలు సేకరించారు.

శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌కు మాతృవియోగం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందారు. శనివారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు జిల్లా నింద్ర మండలం కొప్పేడు గ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. ధర్మకర్తల మండలి చైర్మన్ మాతృమూర్తి మృతిపట్ల శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు ఓ.మధుసూదన్‌రెడ్డి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, మఠం విరూపాక్షయ్యస్వామి, ఎం.విజయలక్ష్మి, డాక్టర్ కనకదుర్గ, మురళి, నరసింహారెడ్డి, సుజాత, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు ఆమె మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- పది మందికి గాయాలు

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని విక్టోరియా పేటలో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గుజరాతీ పాఠశాల సమీపంలో పది మందిని కరవడంతో హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలివచ్చారు. స్థానికులు వెంటనే పిచ్చి కుక్కను చంపివేశారు. గాయపడిన వారిలో సద్దాంహుసేన్, దివ్యాంగురాలు సుజాత, విశ్వనాథ్‌తో పాటు ఏడుగురు ఉన్నారు.


ఓర్వకల్లు: నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుడు


ఆదోని: నిమజ్జనోత్సవాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్


ఆదోని: నీటి పంపిణీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్


కోసిగి: ఊరేగింపుగా వెళ్తున్న మట్టి గణనాథుడు

ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా!


కోవెలకుంట్ల: పట్టణంలో వినాయక విగ్రహాల ఊరేగింపు


బనగానపల్లె మండలం కైప గ్రామంలోని చెరువులో నిమజ్జన దృశ్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలుచోట్ల శుక్రవారం నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఆనందోత్సవాల మధ్య స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. సమీపంలోని జలాశయాల్లో లంబోదరులను నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


నంద్యాల: వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు


నంద్యాల: బాలికల ఆనంద హేల


కోసిగి: ఊరేగింపులో తలపాగాలతో మహిళలు


బనగానపల్లె: పెండేకంటి నగర్ కాలనీలో కళ్లకు గంతలతో ఉట్టికొడుతున్న మహిళ

చిరుధాన్యాలపై ప్రదర్శన


మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ సుందర్‌రావు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ హైస్కూల్‌లో శుక్రవారం 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్' అంశంపై జిల్లా స్థాయి జాతీయ సెమినార్ సందర్భంగా చిరుధాన్యాలపై ప్రదర్శన చేపట్టారు. జిల్లా సైన్స్ అధికారి కె.సుందర్‌రావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో అన్ని యాజమాన్యాలకు చెందిన 8, 9, 10వ తరగతులకు చెందిన 53 మంది విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతపై విద్యార్థులు చార్ట్‌లు, పవర్‌పాయింట్, కొన్ని నమూనాల ద్వారా చక్కగా వివరించారన్నారు. జోషిత (గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నంద్యాల), గురువరణ్ (జ్యోతి విద్యానికేతన్ కోవెలకుంట్ల), సాహిమున్నీసా (ఏపీఎంఎస్ స్కూల్), సూర్యచరణ్‌రెడ్డి (చాగలమర్రి జెడ్పీ హైస్కూల్) ప్రతిభ చాటారన్నారు. జోషిత ఈనెల 25న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైనట్లు జిల్లా సైన్స్‌ఫెయిర్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా దీక్ష కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ న్యాయ నిర్ణేతలుగా కె.ఆంద్రూస్, సబినా పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


సమావేశానికి హాజరైన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): నగరంలో ఈ నెల 26న గణేశ్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రస్తుతం సుంకేసుల బ్యారేజీలో 1 టీఎంసీ నీరు మాత్రమే ఉందని, ఇందులో నిమజ్జనం కోసం 0.2 టీఎంలను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నీటిలో వ్యర్థాలను పడేయకుండా భక్తులు సహకరించాలని కోరారు. ఈనెల 25వతేదీలోపు బారికేడ్ల పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పాతబస్టాండ్ నుంచి వినాయక ఘాట్ వరకు ప్రతి అర్ధ కిలోమీటర్‌కు మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు సూచించారు. అలాగే రెండు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేసుకోవాలని మత్స్య శాఖ జేడీ శ్యామలను ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనం కోసం 9 క్రేన్లను ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజకు సూచించారు. అదనపు ఎస్పీ టి.సర్కార్ మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో 1,548 మందితో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీజే స్పీకర్ల శబ్దాన్ని 10 నుంచి 15 నిమిషాలకు ఒకసారి తగ్గిస్తే పోలీసు కమ్యూనికేషన్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. క్రేన్ల వద్ద రిపేరు చేసే మెకానిక్‌లు ఉండేలా చూడాలన్నారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరాలో కొన్ని చోట్ల అంతరాయం ఉండవచ్చని, ఇందుకు ప్రజలు సహకరించాలని విద్యుత్ ఎస్ఈ ఉమాపతి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, డీఆర్వో మధుసూదనరావు, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు హరీష్‌బాబు, జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కోశాధికారి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

- యువజనోత్సవాల్లో మేయర్ బీవై.రామయ్య


కార్యక్రమానికి హాజరైన యువతీ యువకులు


మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు(హాస్పిటల్): స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కర్నూలు నగర మేయర్ బీ.వై. రామయ్య అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బి.క్యాంపులోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల యువతలో ఆత్మస్థైర్యం మరింత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ కార్యక్రమంలో ఇంత మంది విద్యార్థినులు, మహిళలు పాల్గొనడం శుభపరిణామమన్నారు. సెట్కూరు సీఈవో పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువ కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ముందుగా జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్రస్థాయి, తదుపరి రాష్ట్రస్థాయి విజేతలతో జాతీయ స్థాయి పోటీలు ఏదో ఒక రాష్ట్రంలో నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యకుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలు..

జానపద నృత్యం(గ్రూప్) : ప్రత్యూష గ్రూప్, సిల్వర్‌జూబ్లీ కళాశాల, కర్నూలు, సమీరా గ్రూప్, ఏపీ మోడల్ స్కూల్, కృష్ణగిరి, దేవిశ్రీ గ్రూప్, ప్రభుత్వ బీఈడీ కళాశాల
జానపద నృత్యం(సోలో) : ధరణి, రమ్య, లక్ష్మీకాంతమ్మ
జానపద గీతం (గ్రూప్): ప్రవల్లిక గ్రూప్, కీర్తన గ్రూప్, లీలావతి గ్రూప్
జానపద గీతం(సోలో) : ఇ.జ్యోతి, బి. సచిన్, బి.లక్ష్మీదేవి
ఫోటోగ్రఫీ : కుల్దీప్ నారాయణ్, బి.చరిత, షోయబ్ అక్తర్

జీవాలను సంతకు తరలిస్తుండగా..

- మందపైకి దూసుకెళ్లిన లారీ
- 15 జీవాలు మృతి


మృతి చెందిన జీవాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె గ్రామ సమీపంలో జీవాల మందపై లారీ దూసుకెళ్లడంతో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఫతేనగర్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి సుమారు వంద జీవాల మందను శుక్రవారం తెల్లవారుజామున బనగానపల్లెలో జరిగే సంతలో విక్రయించేందుకు బయలుదేరాడు. యాగంటిపల్లె సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే బనగానపల్లె నుంచి ప్యాపిలి వైపు అతివేగంగా వస్తున్న మహా సిమెంట్ సంస్థకు చెందిన లారీ జీవాల మందపై దూసుకెళ్లింది. లారీ టైర్ల కింద పడ్డ 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు జీవాలకు తీవ్ర గాయాలయ్యాయి. జీవాలపై దూసుకెళ్లిన లారీ రోడ్డు పక్కనే నిలిపిన కారును సైతం ఢీకొట్టింది. దీంతో కారు సైడ్ భాగం పూర్తి దెబ్బతినింది. తెల్లవారుజామున లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని జీవాల యజమాని కృష్ణమూర్తి తెలిపాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎస్ఐ రామిరెడ్డి వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని మృతి చెందిన జీవాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.